# సింగప్పిరాన్ - శ్రీరంగనాథ పునః ప్రతిష్ఠ

డా. నేలటూరు వెంకటరమణయ్య

## 1

ఆ రోజు ముక్కోటి ఏకాదశి. రంగస్వామి దర్శనార్థమై వందలకొలది కోసుల దూరమునుండి పయణము జేసి వచ్చెడి యాత్రికులతో నిండియుండి కావేరీ తటవా యుదయము నిర్జనమై యుండెను. సింగిప్పిరాను వచ్చినాడు బహుదూర ప్రయాణముజేసి పెరుమాళ్లను సేవించుటకు. కాని కావేరి నిర్జనముగ నుండుననియు శ్రీ రంగము పాడుపడియుండు ననియు నతఁడను కొనలేదు. అతనికి మొదట శ్రీరంగమునకు వచ్చి పెరుమాళ్లను సేవించవలయునను ఇచ్ఛయే లేదు. తన గ్రామముననె తనకారు కుఱ్ఱ వాండ్రలో గూడ, మసీదులోని ముల్లాసాయబుల వారికడ నాలుగు పారశీ ముక్కలు నేర్చుకొని మధురకు బోయి సుల్తానువారి దేవిడీ కాచి యేదైన యొక చిన్నయుద్యోగము సంపాదించుకొనవలయునని యతని యుద్దేశము. కాఫిరులయెడ సాయబులందఱివలె ముల్లాసాయబుల వారికి ద్వేషము గలిగియుండినను సింగిప్పిరానువిూద నతఁ డెక్కుడభిమానమును జూపు వాఁడు. కారణము లేకపోలేదు; అతని దస్తూరి చక్కనిది, ఇంచుమించుగ ముల్లాసాయబు వారివలె వ్రాయనేర్చినాఁడు. పార్శీ నేర్చుకొనుటయందు చాల చుఱుకుదనము జూపినాఁడు; తోడి యువకు లింకను ఆరంభదశయందుండగనె సఅది బూస్తాన్ గులిస్తానులను ముగించెను; ఫిర్దౌసినిజామీల షానామా సికందరు నామాల పఠనను పూర్తిగావించి హాఫీజా దీవాను నారంభించెను. ముల్లాసాయబువారి ప్రేరేపణ విూద ఖురాను చదువదొడగి కొన్ని సూరాలను కంఠస్థము గావించెను. స్వరయుక్తముగ సింగిప్పిరాను ఖురాను పఠించుటను విని ముల్లాసాయబు బానందించు వాడు. ఖురాను పఠన సంపూర్ణమైన పిమ్మట నతనిచే హాదీసు జదివించి యతనికి ఇస్లాము తత్వమును బోధించి మహమ్మదీయ మతదీక్ష నీయవలయు నని ముల్లాసాయబుగారి యుద్దేశము. కాని యతని యుద్దేశము నెఱవేఱినది కాదు.

ఒకనాడు అస్తమయ కాలమున కాలకృత్యములను నెఱవేర్చుకొనుటకు సింగిప్పిరాను ఊరి వెలుపటి తటాకమునకు బోయెను; క్రుంకుచుండిన సూర్యుని యరుణ కిరణముల కాంతివలన తటాకమున జలము రక్తవర్ణము దాల్చియుండినది. తటాకము మెట్లపై నొక యసిమిసంచి గాన వచ్చెను; దాని సవిూపముననే మోకాలిబంటి నీట పశ్చిమాభిముఖుఁడై నిలిచి యొక ముసలి బ్రాహ్మణుఁడు దోసిట జలమెత్తి యర్ఘ్యము విడుచుచుండెను. సింగిప్పిరానా వృద్ధునిచూచి యుండలేదు. మెట్లవిూది యసిమి సంచిని చూచి యతఁడు బాటసారియని నిశ్చయించెను. సంధ్యావార్చుచుండినందువలన నా ముసలి బ్రాహ్మణుని సింగిప్పిరాను హెచ్చరించలేదు. తాను నతని చేరువనే నీటదిగి ముఖప్రక్షాళనము గావించుకొని సంధ్యవార్చ దొడగెను; సంధ్యవార్చి తటాకము వెలువడు నప్పటికి ఆ ముసలి బ్రాహ్మణుఁడు మెట్లపై గూర్చుండి యసిమి సంచిలోని పేపపెట్టెను తెఱచి యందలి పులిహోర దధ్యోదనముల నారగించుచుండెను. సింగిప్పిరాను చెంతకువచ్చి నిలిచి,—'అడియేన్, దాసుడ'నని యభివందన మొనర్చెను.

'దాసానుదాసుఁడ'నని యా ముదుసలి ప్రత్యభివందనము గావించెను.

'స్వామివారెచ్చటినుండి విచ్చేయు చున్నారు.?

'కాంచీపురమునుండి'?

'దాసుని యఱగొడ్డెతనమును క్షమింపవలయును. దేవరవారి పయణ మెచటికి?'

'కోవెలకు'

'ఎందులకో?'

'పెరుమాళ్లను సేవించుటకు?'

'పెరుమాళ్ళనా?'

'ఆఁ'.

'కోవెలలో పెరుమాళ్లు లేరే? కోవెలను తురకలు పాడుచేసినారే.'

'అవును. కోవెలను పెరుమాళ్లు త్యజింతురా? ఒక్క పర్యాయము భక్తులను కటాక్షించుటకొఱకు వాహ్యాళి వెడలిరి; మరలి శ్రీరంగమునకు వేంచేయుచున్నారు. దేవరవారికి స్వాగత మిచ్చుటకు శ్రీవారి నగరము నలంకరించి పురజనుల సంసిద్ధపఱచుటకొఱకే ఈ దాసుఁ డచటి పోవుచున్నాఁడు.' 'స్వామివారు క్షమించవలయును ఈ దాసుని యపరాధమును—తురకల యధికారము పాండ్య చోళ మండలములపై నింకను నిరాఘాటముగ సాగుచున్నదే; కోవెల మొదలగు పుణ్యక్షేత్రము లింకను వారి యధికారము క్రిందనే యున్నవే? పెరుమాళ్లు మఱలి కోవెలకు ఎట్లు రాగలరు? స్వామివారి కడక ఎట్లు నెఱవేఱగలదు? ఈ ప్రయాణము వ్యర్థము గాదా?'

ఈ ప్రశ్నల దొంతరను విని యా ముసలి బ్రాహ్మణుఁడు నవ్వి ఇట్లు బదులు పలికెను. 'కోవెల మొదలగు పుణ్యక్షేత్రములు మహమ్మదీయుల యేలుబడి క్రింది దేశమున నిమిడియుండుట నిజమే; కాని పెరుమాళ్ల ప్రభావము తురకల శక్తికి దీసిపోయినదా? దైవోపహతులైన తురకలన నెంత? వారికి పోగాలము సమీపించినది?'

'స్వామివారి మాటను కాదనుట కీదాసుఁడు సాహసింప జాలఁడు; భగవంతుని ప్రభావ మెంతటి యతిశయమైనను నది మనుజుల మూలముననే కదా ప్రకటితము గావలయును. ఈ కలికాలమున దేవుఁ డెచ్చటను స్వయము దుష్టసంహారమునకు గడగినట్లు వినియుండలేదు. నేటివఱకును తురకల యధికార మప్రతిహతముగ సాగుచున్నది; వారి వినాశన సూచన లెచటను గాన్పించలేదు; ఇకవారికి పోగాలము వచ్చినదని యెంచుట కవకాశమేది?'

'కన్నులుండియు చూడజాలని వారికిని చెవులుండి వినజాలని వారికిని వచ్చిచెప్పుట కష్టసాధ్యము. కాని—'

ఈ దాసుని యజ్ఞానమునకు గోపించ వలదు; తెలియక స్వామివారి నడిగితిని.'

'కోపములేదు, నాయనా, కోపములేదు—విను—ఆనెగొంది నెఱుఁగుదువా?'

'ఎఱుగను, కాని అది సుప్రసిద్ధగిరి దుర్గమని వినియున్నాను. అది తుంగభద్రా తటమున గదా యున్నది.'

'హిందూ స్వతంత్రభానుఁడచట ఉదయమైనాఁడు; విద్యారణ్య మునియచట సనాతన ధర్మమును పునరుద్ధరించుటకు రాయసింహాసనమును స్థాపించినాఁడు. వారి యాదేశము చొప్పున సంగమ రాజ పుత్రులు హరిహర బుక్కనృపాలురు హిందూ పారతంత్ర్య నిర్మూలనకు గంకణము కట్టుకొని యున్నారు.'

'చిత్తము. వారింతదూరమువచ్చి పాండ్యచోళ మండలములను తురకలను బాఱదోలి విడుదల సేయుదురా?'

'తప్పక. కోవెలయందు శ్రీరంగనాథుని పునః ప్రతిష్ఠ సేయవలయునని విద్యారణ్యులవారి యాజ్ఞ యైనది. రాయలవారి సైన్యముతోఁగూడ తిరుమల నుండి పెరుమాళ్లు తరలివచ్చి సింగపుర మహాగ్రహారమున వేంచేసి యున్నారు. ఇకనైన మ్లేచ్ఛులకు పోగాలము వచ్చినదను నమ్మకము గలుగుచున్నదా?'

'చిత్తము.'

మాటల ధోరణియందు వారు ప్రొద్దు గుంకుటను గాని చీకటి పడుటను గాని గమనించలేదు. ఆ ముసలి బ్రాహ్మణుని మాటలు సింగప్పిరాను నొక నూతన యూహాప్రపంచమున ముంచివేసినవి; మరల శ్రీ రంగనాథుఁడు కోవెలకు వచ్చుచున్నాఁడా? తా నెట్టి మూఢుఁడు; భగవంతుని ప్రభావము ప్రకాశించుటకు ఎన్ని మార్గములు లేవు. ఎట్టి పుణ్యాత్ముఁడా విద్యారణ్య ముని; భగవంతుని కరుణా కటాక్ష వీక్షములా మహనీయునిపై బఱగినవి. ఆయన భక్తి మహిమ యెట్టిదో తన్ను కోవెలకు గొనిపొమ్మను భగవంతుని యాజ్ఞకు గురి యగుటకు? శ్రీ రంగనాథుని సేవ వంశపారంపర్యముగ దనకు వచ్చిన కాణయాచి—తనపై

దేవాదిదేవునికి దయలేక పోవుట తన దురదృష్టము. అవును, కులధర్మము ననుసరింపక మ్లేచ్ఛులతో గలసి మెలసి తిరుగుచు మ్లేచ్ఛభాష నభ్యసించి మ్లేచ్ఛుఁడగుటకు సంసిద్ధుఁడైన తన్నేల రంగ నాథుఁడు కటాక్షించును? కటాక్షించఁడా? తన తండ్రి తాతముత్తాతల సేవ యేమైపోయినది; పెరు మాళ్ళు కోవెలకు వచ్చునప్పటికి తాను నచటికే పోయి తన కాణయాచి నిమ్మని నిక్కచ్చి పెట్టిన యెట్లు తప్పించుకొనగలడు? అని పలు విధముల చింతించి తుదకు దృఢ నిశ్చయుఁడై 'స్వామీ!' యని యా ముసలి బ్రాహ్మణుని హెచ్చరించెను.

'ఏమి నాయనా? చాల ప్రొద్దుపోయినది. ఈ గ్రామములోనికిఁబోయి రాత్రి విశ్రమించుట కెవరి పంచయాశ్రయమునైనను వెదకుకొనవలసి యున్నది. పోవుదమా?'

'చిత్తము. స్వామివారు ఈ దాసుని ఇంట నీ రాత్రి నివసింపవచ్చును. ఈ దాసునికొక కోరిక కలిగినది. స్వామివారు సమ్మతింతురేని మనవి చేసు కొనుచున్నాను.'

'చెప్పుము; శక్తికిమించకపోయిన నీ యభీష్ట మును నెఱవేర్చుటకంటె మించిన ప్రియకార్యమేమియు లేదు.'

'స్వామివారికి సేవచేయుచు స్వామివారితోగూడ కోవెలకీ దాసుఁడు వచ్చుటకు సమ్మతింతురా?'

'అగత్యము రావచ్చును, నాయనా, నిన్ను నేను మోయుదునా ఏమి.'

అంతట నచటనుండి లేచి యా ముసలి బ్రాహ్మణుఁడు సింగప్పిరానుతో గూడ నతని ఇంటికి బోయి వాకిటి పంచ యరుగుపై దన వీాది వచ్చడ మును బఱచుకొని యసిమిసంచిని తలగడగ నుంచి కొని విశ్రమించెను. సింగప్పిరా నటు తరువాత గృహము లోనికి బ్రవేశించి భోజనాదికములను ముగించుకొని మరలి పంచలోనికి వచ్చెను. అప్పటికే ఆ ముసలి బ్రాహ్మణుఁడు గురకపెట్టి నిదురించుచుండినాడు. ఆయనను మేల్కొలుపుటకు సింగప్పిరా నిష్టపడలేదు. మెల్లగ నచట నొక మూల జుట్టిపెట్టియుండిన టెంకాయాకుచాపను బఱచుకొని యెడమచేతిని దిండు చేసికొని పండుకొనెను. కాని ఎంతసేపటికిని అతనికి నిదుర పట్టలేదు; మనస్సు పరిపరి విధముల బఱుగు లిడ నారంభించినది. అంతదనుక నతని జీవయాత్ర యా కుగ్రామమున నిర్విఘ్నముగ నడచినది; విద్యా భ్యాసమున నిమగ్నుఁడైయుండిన కారణమున నతని కన్య చింత లేదాయె. దక్షిణ సుల్తానుగారి కొలువున ప్రాయసపదమె యతని జీవితమునకు పరమావధి. ముల్లాసాయబునకు సుల్తాను దేవిడియందు మంచి పలుకుబడి యుండుటవలన నాతని నాశ్రయించి తనన్కాలమున దన మనోరథ సిద్ధి బడయనెంచెను; కాని యా ముసలి బ్రాహ్మణునితోడి సమాగమమతని దృక్పథము నన్యత్ర త్రిప్పివేసినది. అతని జీవయాత్ర యందది యొక విషమ ఘట్టము, చీలుబాటల కూడలి—ఏ మార్గము ననుసరించి ముందునకు సాగుట యుక్తమో నిశ్చయించుకొనవలసి వచ్చినది. ఆ ముసలి బ్రాహ్మణునితో గూడ శ్రీరంగమునకు వచ్చెదనని చెప్పినాడు. ఇంతకాలమును నేర్చిన విద్యను వ్యర్థము జేసి సుల్తాను కొలువువీాది యాశకు స్వస్తి చెప్పి శ్రీరంగమునకు బోవుట శ్రేయస్కరమా? ఆ బ్రాహ్మ ణుడు చెప్పినట్లు, కోవెలకు పెరుమాళ్ల పునరాగ మనము వాస్తవమైనను దనవలన నచట జరుగవలసిన ముఖ్యకార్యములేమి కలవు? తానొక సామాన్య జనుఁడు; కుగ్రామవాసి. దేశములేలు ప్రభువులు సేయగడగిన మహాకార్యమునకు దన సాయమవశ్యము గాదు; కాని తన పెద్దలు తరతరములనుండియు శ్రీరంగనాథుని దాసులు; వారి వంశమున బుట్టిన కారణమున దానును రంగనాథుని దాసుఁడే. దాస ధర్మమునకు వ్యతిరిక్తముగ బ్రవర్తించుటకు దనకు స్వాతంత్ర్య మెచ్చటిది? యజమానుని యాజ్ఞయైన ప్రాణములైన సమర్పించుకొనవలసినది దాసుని విధి. పెరుమాళ్ల యాజ్ఞయైనది. ఆ వృద్ధ బ్రాహ్మ ణుని మూలమున సేవకు రావలసినదని యుత్తరు పంపినాడు; తనకు దన పెద్దలనుండి సంక్రమించిన యాస్తియంతయు పెరుమాళ్లదాస్య మొక్కటియే. దానిని త్యజించుటమేలా? ఇట్లు చింతించుచు జాలసేపు తేఁపోయుచు సింగప్పిరాను పడకపై బొరలుచుండెను. పలుమారు కన్నులను గట్టిగ మూసికొని మనస్సును గళవళ పెట్టుచుండిన భావ

పరంపరను గుదియబట్టవలయునని ప్రయత్న మొనర్చెను; కాని గోవావు కోడెలవలె బాఱుతెంచు తలంపుల తనిచే గట్టబడవాయె. తుదకు అతని కన్నులప్రయత్నముగనె మూతలు బడిపోయినవి. హృదయ నిక్షిప్తాజ్ఞాత భావప్రపంచమున ఇసుకయం దింకు నీటి వలె నతని తలపులు లీనమై పోయినవి.

కన్నులు ముకుళితములై మనోవ్యాపార ముడిగినను సింగప్పిరాను నిద్రావస్థను జెందలేదు. ఆత్మ ప్రబోధ మందినది; అంతశ్చక్షువు వికసించెను. దివ్య దృష్టి కలిగినది; నూతన దృశ్య మొకటి పొడ కట్టినది. సూర్యోదయ సమయము—బాలసూర్యుని పసిడి కిరణములు ప్రపంచమునకు బంగారు జలపోత పోసినవి. పెన్నయేఱు — ఏటినడుమ తెల్లని యిసుక పఱపుపై బఱచిన కెంబట్టు జముకాణమువలె యరుణాతపచ్ఛాయచే గుసుంభవర్ణము దాల్చిన నీటిపాయ— ఎచ్చట జూచినను నేల యీనినట్లు జనము-స్త్రీలు, పురుషులు, బిడ్డలు, పడుచువారు, వృద్ధులు; నదీ జలములను ఫల పుష్పాదులచే నర్చించువారు, సంకల్పమును జెప్పించుకొని నదీజలమున గ్రుంకు లిడువారు; స్నానమాడి పులిన తలమున నాసీనులై నామములను దిద్దువారు; స్నానార్థము వచ్చువారు; స్నానమును ముగించుకొని గట్టునకు బోవువారు వందలకొలది వేలకొలది జనము క్రిక్కిరిసి యుండినది. ఒక రెప్ప పాటు కాలమున నీ దృశ్య మెట్లో మాయమై పోయినది. దాని స్థానమున నొక గొప్ప దేవాలయము గాన వచ్చినది; జనసమూహముచే బిక్కటిల్లుచుండిన ముఖమంటపము; దాని కెదుట చీకటియందు బ్రుంగు దీపస్తంభములతోడి గర్భ గృహమును గోచరించినవి. ముకుళిత హస్తములతోడి భాగవత బృందము గర్భ గృహద్వారమువైపు నిరీక్షించు చుండెను; అల్లాండు పల్లాండు పఠన ధ్వని యొకప్రక్క వేదఘోష యొక ప్రక్క సెలంగుచుండెను; జన సమర్దమునే వాత ప్రచారము సన్నగిలి యుక్కపుట్టి ముఖమంటపమంతరాళమంతయు గమ్మరి కొలిమివలె సెగలు గ్రక్కుచుండెను; ఆ వేడి తాకునకు భక్తుల దేహములు కఱగుచున్నట్లు స్వేదజలప్రవాహ పూరితము లగుచుండినవి. ఎట్లో సింగప్పిరాను గర్భ గృహద్వారమున కెదుట స్వామి దర్శనార్థము వేచియుండు జన సమూహమునకు ముందు నిలిచియుండెను. మంత్ర పుష్పమును బఠింపుచు నర్చకులు పెద్ద హరివాణమున కర్పూర ఖండములను గుప్పపోసి వెలిగించి నివాళించుచుండిరి. ఆ వెలుంగున చీకటియం దణగియుండు మూల విరాట్స్వరూపము స్పష్టముగ గాన వచ్చినది. శిలా విగ్రహమునకు సహజమైన జడ స్వభావము వీడి చైతన్యమును బొందినట్లు తోచినది. ఆశ్చర్య పులకాంకిత గాత్రుండై సింగప్పిరానా యద్భుత దృశ్యమును రెప్ప వాల్పక జూచుచుండెను. తూము తలగడ మీది నుండి తిన్నగ రంగశాయి శిరమును బైకెత్తి లేచి కూర్చుని నట్లు గానవచ్చినది. పెరుమాళ్లకు గుడిప్రక్క నాచ్చియారు ప్రత్యక్షమైనది; 'సింగప్పిరానువంక ఆ పురాణ దంపతులు మొగము దిప్పి పిన్ననగవుతో 'కుమారా! వచ్చితివా?' యని పల్కిరి. వారి ప్రసన్న వదనము సింగప్పిరాను హృదయము నాకర్షించినది. వారి యభయహస్తమాతని మనమునం దపూర్వమైన స్థైర్యము గలిగించినది. ఇంతటనె కర్పూర నీరాజనమును గొని యర్చకులు గొనివచ్చి యతనిముందు నిలిచిరి. హస్తతలమును గర్పూర జ్వాల పైనిడి నమ్రుండై కన్నుల నద్దుకొనియెను. అతని మొగమునకు సెగ దాకినది. కన్నులమూతలు వీడి మెలంకువ వచ్చినది. దేవాలయమును లేదు; భక్తసమూహమును లేదు. తాను రాత్రి విశ్రమించిన యరుగుమీద తాను వేసుకొనిన ఈంకాయాకు చాపమీదనే పరుండి యుండెను; లోపలనెవ్వరో 'మేలుకొనవే రంగనాథా, మేలుకొను కావేరి నిలయా, మేలుకొను కరుణా సముద్రా, మేలుకొను దేవా!' యని పాడుచుండిరి. సూర్యోదయమై రేయెండ యతని ముఖముపై బ్రసరించి యుండినది. కూర్చున్నాడు. మొట్ట మొదట అతని దృష్టిప్రక్క అరుగుమీందికి బారినది. అది ఖాళీ. వృద్ధబ్రాహ్మణుండు గాని యతని యసిమిగాని కానరాలేదు. లేచి లోపలికిబోయి యతని గూర్చి విచారించి నాడు; అతండింట బ్రవేశించలేదు. వీధి వెంటబోవు వారిని అడిగినాడు. ఎవ్వఱును చూడలేదని చెప్పినారు; తటాకము చెంతకు బోయి వెదకినాడు; అతని పొడయెచ్చటను గానరాలేదు. ఆ వృద్ధ బ్రాహ్మణుండు నిష్కారణముగ వంచించి పోయినందులకు చింతించుచు దన నిత్యకృత్యముల

జేయ గడగినాడు; కాని మనస్సు నా కలలోఁ గాంచిన దృశ్యమునుండి మరల్చుకొన జాలడాయె.

కొన్ని దినములు గడచినవి; ఆ వృద్ధ బ్రాహ్మణుని యాగమనమును, తరువాత దనకు గలిగిన స్వప్నమును అతని స్మరణము నుండి మాసిపోఁ జొచ్చినవి; కాని మరల నొకరేయి యాకల మఱియు విస్పష్టముగ గానవచ్చినది. అది మొదలా స్వప్న మెడపదడప నతనికి గలుగ నారంభించినది. రాను రాను ఆ దేవుని సుప్రసన్న వదన మతని కన్నులముందు నిరంతరము పొడకట్ట జొచ్చినది. సింగిప్పిరాను అటుపిమ్మట దన గ్రామమున నుండజాలక పోయెను; చదువునందుగాని యితర కార్యములందుగాని యతని కభిరుచి పోయినది. అతని చర్యలన్నియు గలలోని కార్యములవలె కైతవములై—తోఁచినవి. అనుదినమును వర్తించు మనుష్య ప్రపంచము మాయా ప్రపంచముగ మారిపోయినది. ఎల్లప్పుడును అతని మనస్సు కలలో గానవచ్చిన దేవునియందె లగ్నము గాఁజొచ్చెను; అతని మనశ్శాంతి చెడెను; శ్రీరంగమునకుబోయి పెరుమాళ్ల పాదపద్మములపై దన శిరసుంచి పరిచర్య సేయవచ్చితి నని విన్నవించినగాని తనకు మనశ్శాంతి కుదురదను నమ్మక మాతని చిత్తమున దృఢముగ నెలకొనినది.

## 2

తనకలలోఁ గానవచ్చిన శ్రీరంగమునకును వాస్తవ శ్రీరంగమునకును నెంత భేదము గానవచ్చుచున్నది. కావేరీతటమెంత శూన్యముగ గన్పట్టుచున్నది? ఏరీ ఆతైర్థికులు? ఆ భక్తజన బృందమెక్కడ? కల నిశ్చయ మగునా? కలనిశ్చయమని వచ్చుటకు దానెట్టి మూర్ఖుఁడు! ఇంతదూరము వచ్చినందులకు కావేరి పుణ్యజలముల స్నానమాడి యొకసారి రంగని దర్శించి పోవుట యుక్తము. అని నిశ్చయించి నీటియందు దిగి స్నానమొనర్చి యప్పుడె యుదయించుచుండిన సూర్యుని కర్ఘ్యము సమర్పించి నీటియొడ్డున గూర్చుండి నామతీర్థము సేయ గడగెను. ముఖమున తిరుమణి దిద్ది ద్వాదశ నామములయందు తక్కిన వాని దీర్చుటకు వక్షస్థలమువంకను భుజముల వంకను దృష్టిని ద్రిప్పెను. అద్దమున గానవచ్చినది కంఠము వెనుకనుండి కుడితట్టు ఔమ్మ పర్యంతము వ్యాపించియుండు నిడుపైన కత్తిగాయపు మచ్చ. అది కనులబడగనే స్మరణకు వచ్చినది సింగప్పిరాను హృదయ కుహరమున చిరకాలమునుండియు దాగియుండిన సంగతి యొక్కటి.

అది యతని జీవన ప్రభాతము; ఆతేడేండ్ల ప్రాయము; బుద్ధియింకను జక్కఁగ వికసింపలేదు. సమయవరప్రాంతమందలి యొకకుగ్రామమున దనపిన తండ్రికూమార్తె పంకజవల్లికి దిరుమాంగల్య మహోత్సవము జరుగబోవుచున్నదను శుభవర్తమానము వచ్చినది. తిరుమాంగల్యము జూడబోవలయునని యతని తలిదండ్రులు తీర్మానించుకొనిరి. దూర ప్రయాణము; కాలినడకమీద ప్రయాణము సాగించుటకు అతని తల్లికి శక్తి చాలదు. ఉపరి చంక విడిచి దిగని బిడ్డ తానొక్కఁడు; కావున కాలి ప్రయాణము దుస్సాధ్యమైనది. బండి కట్టించుకొని బయలుదేరవలసి వచ్చినది. బండియందు తాను గాక మఱి ముగ్గురు ప్రయాణికు లుండిరి; బండి తోలు నాథముని నొగలమీద; వాని వెనుక వంట పాత్రలు పప్పు బియ్యము మొదలగు భోజన సామగ్రుల మూటలప్రక్క తల్లితో గూడ తాను; కడపట తన తండ్రి—రెండు రోజుల ప్రయాణము సుఖముగ నడచిపోయినది; మొదటిరోజు తన పినతల్లి యింటను మరుసటి ప్రొద్దాక సత్రమునను బస చేసిరి; మూఁడవ దినమందు ఆ యూరును మజిలీ చేసికొని మఱుసటి యుదము పయణము సాగించి పెన్నాఱు దాటి పోవలయునని వారి యుద్దేశము ఆ యూరు పెద్ద బ్రాహ్మణాగ్రహారము; గండరాదిత్య చోళ మహారాజు దానిని అకరము గావించి బ్రాహ్మణుల కిచ్చుటచే దానికి గండరాదిత్య చతుర్వేది మంగలమను నామాంతరము గలిగినది. వైష్ణవులవి గాని స్మార్తులవి గాని యా యూరునం దైదువందల బ్రాహ్మ కుటుంబములు నివసించుచుండినవి. అతిథి యభ్యాగతుల నాదరించుటయం దాయూరి బ్రాహ్మణులు పేరు ప్రఖ్యాతులు గలవారు. కావున నచట నొక రాత్రి బస చేసి చనుట యుక్తమని తోచినది.

వారి బండి యా యూరును జేరునప్పటికి సూర్యుఁ డింకను అస్తంగతుఁడు కాలేదు; క్రుంకుట కింకను బారెడు ప్రొద్దుండినది. కాని వారనుకొని

నట్లు సౌఖ్యముగు వసతి వారి కచట దొరకునట్లు తోచదాయెను. ఏకారణము చేతనో గ్రామ మంతయు కలత జెందియుండినది; వారి రాక నెవ్వరును గమనించరాయె. జనులు భయభ్రాంతచిత్తులై పలు దెసల బరుగులిడుచుండిరి. ఏయింటి ముంగిట జూచినను ప్రయాణ సన్నాహములు గానవచ్చుచుండినవి. కపాడములుగ గట్టిన మూటలు వేగిరపాటుతో మూటలను భారవాహ జంతువర్గపు మూటల నెక్కించుక పాడీగుత్తకాండ్రను నెల్లయెడలను గానవచ్చుచుండిరి. నడివీధిలో బండి దిగి సింగిప్పిరాను తండ్రి యొకరిద్దఱినేమో యడిగినాడు; కాని వారాతని మాటను చెవినిడక చెరియొక దారిని బట్టిరి. నాథమునిని వీరనారాయణ పెరుమాళ్ల కోవెలకు బండిని తోలమని చెప్పి బండి పరము నొక చేతబటుకొని యాతడును తిన్నగ బండి వెనుక నడచి నాడు. దేవాలయపు గోపురము ముందట బండి యాగినది; మొదట సింగప్పిరాను తల్లి బండి దిగి యటు తరువాత సింగప్పిరాను జేరదీసి చంకనిడుకొని భర్త వెంట దేవాలయమును బ్రవేశించి కల్యాణ మంటపము లోని యొక కంభముచెంత బిడ్డను దింపి కంభము నానుకొనినది. గ్రామమునందు గానవచ్చుచుండిన కళవళ చిహ్నములే దేవాలయమునందును గానవచ్చుచుండెను. స్థానపతియు స్థానమువారును సమావేశమై యుండిరి. పారుపత్యగానితోగూడ కొందఱు స్వామివారి యుత్సవ విగ్రహములను మోచికొనిపోయి దేవాలయపు భాగియందు వైచిరి. శ్రీ భండారమును దెఱపించి కరణీకుల చిత్తా ప్రకారము స్వామివారి తిరువాభరణములను నమ్ముతపడి యారగింపు టవసరములందు వినియోగించు వెండి బంగారు పాత్రలను సరిచూచి స్థానపతి యొక యిత్తడి భోషాణమున బెట్టించు చుండె. అస్తమయమైనను స్వామివారి తిరుమాళిగయం దెచటను దీపారాధన ప్రయత్నము గానరాదాయె. కొంత దడవైనపిమ్మట తాము జేయుచుండిన కార్యమును ముగించుకొని యెవరి దారిని వారు పోయిరి. తరువాత దేవాలయము నంతటిని పరిశీలించి చూచుచు స్థానపతి కల్యాణ మండపమునకు వచ్చి యచట భార్యచెంత నిలిచియుండిన సింగప్పిరాను తండ్రిని గాంచి సమీపమునకు వచ్చి చేతులు మోడిచి, 'అడియేన్ దాసన్' అని యభివందించెను. సింగప్పిరాన్ తండ్రి 'దాసానుదాసన్', అని ప్రత్యభివందన మొనర్చెను.

'స్వామివా రెచ్చటికి వేంచేయు చున్నారు.'

'సమయవరమునకు.'

'సమయవరమునకా?'

'ఆఁ అచట నా తమ్ముని కుమార్తె తిరుమాంగల్య మహోత్సవము జరుపుటకు పెద్దలు నిశ్చయించినారు. ఆ శుభ సమయమున దాసుడచ్చట వచ్చు భక్తబృందమునకు సేవయొనర్పవలసి యున్నది.'

'స్వామి వారచటికి పో వలను పడదేమో?'

'ఏల.'

'దేశ సంక్షోభమువలన.'

'అట్లనెదరేల? బల్లాలరాయలు దేశమును పాలించుచుండగా సంక్షోభమెట్లు కలుగును?'

'బల్లాల రాయల యేలుబడి సమాప్తియైనది; తురకదొరలు మరల దేశము నాక్రమించుకొన్నారు; మన జాతికి వినాశకాలము సంప్రాప్తమైనది.'

'కృష్ణ! కృష్ణ! ఎవ్వరును అనుకొన గూడ లేదే. ఎప్పుడస్తంగతులైనారు మహాప్రభువులు?'

'అస్తంగతులైన చింతించవలసిన యవసరమేమి కలదు? తురకలచే జిక్కినాడు; విధికృతమును దప్పించుకొనుట కెవరికి శక్యము.'

'ఆ మహారాజును బందీకృతుని సేయునంతటి బలము తురకవారి కెచ్చటనుండి వచ్చినది; ప్రతి యుద్ధరంగమునను ఆయనచే దన్నులుతిని కోటగోడలే శరణస్థానములై దాగిరే? రామసేతువుకడ నా మహారాజు జయస్తంభమును నిలబెట్టెనను వార్తను విని యింక నొక్క వారము దినములుగూడ దాట లేదే.'

'నిజమే, నిన్నటి మధ్యాహ్నము వఱకును ఎవరనుకొన్నారు ఆయన తురకులను పూర్ణాహుతి సేయడని? ఎంతమంచి గొల్లవానియందైనా వేపకాయంత వెఱ్ఱియుండకపోదను సామెత కాయన చక్కని నిదర్శనము. స్వయం కృతాపరాధమునకు దగిన శిక్షయే యైనది. కాని ఆ ప్రభువును నిందించుట తప్పు.

బుద్ధిః కర్మానుసారిణీ యన్నారు పెద్దలు...ఆయన యేమి చేయగలడు?'

'స్వయంకృతాపరాధమా?'

'కాక మఱేమి? పాముపై గరుణించి దానికి పాలుపోసి సాకినను అది కఱవక మానునా?'

స్వామివారు చెప్పుమాట లీ దాసునకు దుర్గ్రాహ్యములుగ నున్నవి?'

'వినుఁడు చెప్పెదను; సేతు మూలమున జయస్తంభమును నాటిన పిమ్మట, చోళ పాణ్డ్య మండలములం దచట నచట గాపుండిన తురక దళములను ఠాణ్యములను ధ్వంసము జేసిరి; చోళ మండలమున నొక్క తురక పురుగునైనను రానీయక చిదుగబొడిచి రూపు మాపెను—'

'బాగు, బాగు! మఱి స్వయంకృతాపరాధ మంటిరే?'

'కొంచమో పిక బిగబట్టి తుదముట్ట వినుడు. పాండ్య మండలముపై దండయాత్ర సాగించి దక్షిణ భారతభూమిని నిష్తురుష్కను గావింప నిశ్చయించి దళములను నడపినాడు. రణరంగమున బహిరంగముగ బల్లాళరాయల నెదుర్కొనజాలిన బలము మధుర సుల్తానుకడ లేదు; కలుగులలోని యెలుకలవలె ఎక్కడ తురక లక్కడ దాగిరి. కాని కావేరి దాటుటకు పూర్వము దాని యొడ్డున నచట నచట గల తురక ఠాణ్యములను నిర్మూలము గావింపవలసినది యావశ్యక మాయెను. అందఱొక యెత్తు అగస్త్యుఁడొక యెత్తన్నట్లు తక్కిన తావుల నాక్రమించుట కంటె కన్ననూరు కుప్పమును బట్టుకొనుట బహు దుష్కర కార్యమైనది. కాని రాయల వా రా స్థలముల నన్నిటిని స్వాధీనపఱచుకొని కడపట కన్ననూరు కుప్పముపై దండు నడపెను; మహమ్మదీయు లతని నరికట్ట ప్రయత్నము సల్పిరి; కాని పరాజయము నంది మధురకు బాఱిపోయిరి; రాయ లంతట కన్ననూరు కుప్పము నాఱు నెలల పర్యంతము ముట్టడించెను. తురకలకు తల ప్రాణము తోకకు వచ్చి నట్లైనది. పుట్టలోని పాములను చిదగ బొడిచి నట్లు వారిని ధ్వంసము సేయక వారిపై కరుణించి కోటను వశపఱచి పోయిన సుఖముగ పోనిచ్చెదనని వర్తమానము జేసెను; తమ సుల్తానుగారి యనుమతిని బొంది యల్లే చేయుదుమనియు, సుల్తానుకు దెలియజేసి యతని యాజ్ఞను బడయుట కొకపక్షము కాలము పట్టుననియు నంతవఱకు యుద్ధము నాపి తమతో దాత్కాలిక సంధి కొడంబడవలయుననియు గోరిరి. తెల్లనివన్నియు పాలు నల్లనివన్నియు నీరని విశ్వసించు నా ప్రభువందులకు సమ్మతించి యుద్ధమును సాలించి శిబిరములయందు విశ్రాంతిమైనుండెను. పదిహేను దినము లింకను గడువ లేదు. ఒకనాడు మధ్యాహ్న సమయము. ఎండ వేడియోర్వ గూడక పోయెను. నిర్భయముగ బల్లాళరాయల సైన్యముల శిబిరములయందు విశ్రమించి యుండిరి. పహరావాండ్రు సైతము దమస్థానము లందె సొమ్మసిల్లి నిద్రించు చుండిరి. మబ్బులేని మింటినుండి పడిన పిడుగువలె పైఁబడినది తురక దండు. సుల్తాను ఘయ్యాజుద్దీను దామ్ఘనుషా స్వయముగ దండు నడపుకొని వచ్చినాడు; అతనికి దాపటను వెలుపటను సైపుద్దీను బహాదూరు మలిక్ మహమ్మదులను దళనాయకులు కుడి యెడమ భుజముల వలె వచ్చిరి. ఆదమరచి యుండిన హిందూ శిబిరముపై బడిరి. హిందూ భటులందఱు కసాయివానిచేతి గొఱియ లైరి. ఒక భటునికైనను ఆయుధమును ధరించుట కవకాశము లేకపోయినది. అనేకులు మడిసిరి; పెక్కండ్రు పరారియైరి. ప్రొద్దు వ్రాలునప్పటికి బల్లాళరాయ సైన్యము ధ్వంసమై పోయినది. బళ్లాలరాయలు—ఎనుబదియేండ్ల వృద్ధుఁడు—గుఱ్ఱమునెక్కి శిబిరమునుండి పాఱిపోవుచుండగా తురక రౌతున కొకనికి పట్టుబడి బందీకృతుఁడైనాఁడు. ఇది జరిగిన వృత్తాంతము. సమయవరమునకు ప్రయాణము సాగునో లేదో స్వామివారే నిర్ణయించుకొనవచ్చును.'

'ఎంతటి యాపద! ఎంతటి యాపద! మన జాతికి దేశమునకును గీడు మూడినది; ధర్మ విప్ల

వము తప్పక గలుగును. కానున్నది కాకమానదు గదా. భగవంతునికి మనపై నెప్పుడు కరుణ కలుగునో? ఇచటనుండి రేపటి యుదయము పయనమును విసర్జించి వచ్చిన దారినే వెనుదిరిగిపోవుట యుక్తము.'

'రేపటి యుదయముననా?'

'మఱి ఈ రాత్రియందు ఎట్లు ప్రయాణము సేయగలము? మా యింటి యజమానురాలు మిక్కిలియు బడలియున్నది. పిల్లవానికి నిద్రాసమయము. ఎడ్లు డస్సియున్నవి.'

'స్వామివారు గ్రామములోని పరిస్థితులను గమనించి చూడలేదు కాబోలు.'

'చూడకేమి? మాటల సందడిని మరచి పోతిని. గ్రామమున నెచ్చట జూచినను సంభ్రమ సూచనలు బొడకట్టుచుండినది. భయమునకు గారణమేమో తెలియదు.'

'తురక దండిటు వచ్చుచున్నదనియు దారి పొడుగునను ఇడియని దేవాలయమును, నగ్నియందు భస్మము గాని గృహమును, మానభంగ మొందని స్త్రీయు ప్రాణము గోల్పోని మనుష్యుడు లేడని సమాచారము వచ్చినది. భయమునకు గారణము లేకేమి? ఈ యవాంత్రమును దప్పించుకొని యాలుబిడ్డలతో క్షేమముగ గట్టెక్కినవాడు గదా ధన్యుడు.'

'మీరు చెప్పినది గాలివార్త యని తోచుచున్నది. పెన్నాఱు వఱకును శంబువ రాయల రాష్ట్రము. అన్యరాష్ట్రముపై నిష్కారణముగ సుల్తానెత్తిరా సాహసించునా? రాజనారాయణ శంబువరాయండేమి యంతటి కొంచెవాడా?'

'స్వామి వారి వాక్యములు కాదన్నందులకు క్షమింపవలయును. తురకల కొక నీతి నియమమును కలదా? చెంగమ కనుమనుండి కర్నాటక సైన్యము వచ్చునను భయము సుల్తాను గుండెల నలజడి పెట్టుచున్నదట. వారి నిటువైపు రానీయక కనుమ నరికట్ట సైన్యమును గదల్చుకొని వచ్చుచున్నాడట. అది యెట్లున్న నేమి? సభవారు తీర్మానించి నారు, ఈ యుపద్రవము కడచనునంతవఱకును గ్రామమును వదలి చుట్టుపట్లనుండు నడవులకు వలస పోవుట యుక్తమని—ఇక గడియకో రెండు గడియలకో గ్రామస్థు లందఱు తరల బోవుచున్నారు. స్వామి వారి చిత్తము వచ్చినట్లు చేయవచ్చును.'

'నే నొంటరిని, పరదేశిని; నేను మాత్ర మేమి సేయగలను'? నలుగురితోపాటు నారాయణా యనుటయే శ్రేయస్కరము.

(సశేషం)

